# తన మార్గం

**సరిగ్గా వీధిలోకి అడుగుపెడుతున్న సమయానికి వర్ధనమ్మకి పెద్ద కొడుకు రాఘవ ఎదురొచ్చాడు.**

అతను ఢిల్లీలో ఉంటున్నాడు పాతికేళ్ళ నుంచి. తండ్రి పోయినప్పుడొచ్చాడు ఆరు నెలల క్రితం. మళ్ళీ ఇదే రావడం. మాసికాల్లాంటి కర్మకాండ మీద నమ్మకం లేదతనికి. అన్నదమ్ములిద్దరూ అస్థినిమజ్జనం మాత్రం జరిపారు.

వర్ధనమ్మ వెనక్కి తిరిగి, నడుం దగ్గర దోపుకున్న చిన్న సంచీ లోంచి తాళంచెవి తీసి తలుపు తాళం తెరిచింది. తలుపులు రెండూ బార్లా తెరిచి, చెప్పులు తలుపు వెనకాల గోడ దగ్గర విడిచి కొడుకుని లోపలకి రమ్మంది.

"ఎప్పుడొచ్చావ్ ఊరి నుంచి " అంది కొడుకు వట్టి చేతులకేసి చూసి.

రాఘవ గోడ దగ్గరున్న పొడుగు బల్లమీద కూచుంటూ, "పొద్దున్నే వచ్చాను" - అన్నాడు.

ఆవిడ లోపలికి వెళ్ళి స్టీలు గ్లాసుతో మంచినీళ్ళు తీసుకువచ్చి ఇచ్చింది. ఎదురుగా కాస్త దూరంలో కుర్చీపీట లాక్కుని కూర్చుంది.

"ఒంట్లో బావుంటోందా అమ్మా?"

"ఆఁ, బాగానే ఉంది. లక్ష్మీ పిల్లలూ కులాసాయేనా?"

"లక్ష్మికీ మధ్య ఒంట్లో అంత బావుండడం లేదు".

"ఏఁవీ?"

"రక్తస్రావం ఎక్కువగా అవుతోంది. బాగా నీరసపడిపోతోంది."

"ఉడిగిపోయే సమయం కదా. ఒకటి రెండేళ్ళు తిప్పలు పెడుతుంది. మందులు తీసుకుంటోందా?"

"పరీక్ష చేయిస్తే లోపల చిన్న గడ్డలున్నాయన్నారు. వాళ్ళ నాన్నకి హెూమియోపతి వైద్యం

తెలుసుగా. ఆపరేషన్ అక్కర్లేదు మాత్రలతో తగ్గిపోతుందన్నారు. అవే వేసుకుంటోం దిప్పుడు."

"కుర్రాడు ఉద్యోగంలో చేరాడా? పిల్లదాని చదువు పూర్తయిందా?"

"లేదు. వాడు అమెరికా వెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడు. అందుకు వేరే పరీక్షలుంటాయి. వాటి కోసం చదువుతున్నాడు. దానికింకా ఓ ఏడాది చదువుంది."

ఇంకా ఏం కుశల ప్రశ్నలు వెయ్యాలో తోచక వర్ధనమ్మ లేచి వంటింట్లోకి వెళ్ళి, తీగెకి వేలాడుతున్న వెదురు బుట్టలోంచి బాగా మాగిన జామపండు తీసి కడిగి కోసి, చిన్న పళ్ళెంలో పెట్టి పట్టుకెళ్ళి కొడుకు చేతికిచ్చింది. రాఘవ నాలుక కొరుక్కున్నాడు. తల్లి కోసం పండ్లేవైనా తీసుకొచ్చి ఉంటే బాగుండేది. తనకి ప్రయాణం హడావిడిలో తోచలేదు. లక్ష్మి అయినా గుర్తు చెయ్యలేదు. 'అత్తగారికేవైనా పట్టుకెళ్ళివ్వండి' అని. ఈ ఊళ్ళో కాలు పెట్టినప్పటి నుంచీ మీటింగుతో సరిపోయింది. మీటింగు నుంచి సరాసరి ఆటో చేసుకుని వచ్చేశాడు తల్లిని చూడడానికి. తన ఆలోచనల్లో తాను ఉండి, దారిలో పండ్ల దుకాణం వైపు కూడా చూడలేదు.

తప్పు చేసినట్లు బాధపడుతూ, పళ్ళెం పక్కన పెట్టి, "ఈ టైములో పండేమిటి? ఇప్పుడే కాఫీ, టిఫినూ తీసుకొచ్చాను" అన్నాడు.

"అన్నట్టు ఎక్కడికీ బయలుదేరబోతున్నావ్ నే వచ్చేసరికి?"

"ఏదో చిన్న పని మీదలే" అంది వర్ధనమ్మ.

"ఏం పనమ్మా? బజారు నుంచి ఏమన్నా కావాలా? నేను తెస్తాను చెప్పు."

"అబ్బే, ఏమీ అక్కర్లేదురా"

"ఒకర్తెవీ ఇక్కడ ఉండటం ఎందుకంటే వినవు. మాదగ్గరకొచ్చి ఉండొచ్చుకదా అంటే, ఢిల్లీ వాతావరణం పడదంటావు. అక్కడి బాష రాదంటావు. మాధవి దగ్గరికి వెళ్ళవు - కూతురి దగ్గర ఉండనంటావు. పోనీ, ఊళ్లో ఉన్నవాడు కేశవ - వాడొచ్చి ఇక్కడ ఉంటానంటే వద్దంటావు. వాడి దగ్గరుండమంటే వాడిల్లు ఇరుకంటావు. ఎలాగమ్మా?"

"ఇప్పుడు ఏమైందని? నేనిక్కడుంటే మీకేం ఇబ్బంది?"

"ఇంతవరకూ ఏం కాలేదు. ఇకముందు ఏదైనా అయితే - ఏదైనా జబ్బు చేస్తే ఎవరు చూస్తారు? అప్పుడు హఠాత్తుగా ఏం చెయ్యగలం? ఎవరొచ్చి చేస్తారు? డెబ్బయ్యేళ్ళొస్తున్నాయి. జాగ్రత్త పడాలి కదా."

"ఇప్పట్లో నాకేం ఢోకా లేదులే. భయపడకు."

"నీ పట్టుదలే నీది."

వర్ధనమ్మ సమాధానం చెప్పలేదు.

"వంట చేసుకున్నావా?"

"ఇవ్వాళ శనివారం కదా. భోజనం చెయ్యను" అంది.

భోజనానికి ఉండమని మాటవరుసకైనా అంటుందనుకున్నాడు రాఘవ. 'అమ్మ ఎందుకిలా మారిపోయింది? ఇదివరకు నాన్న, చెల్లెలూ, తమ్ముడూ, పిల్లలూ అంతా ఉన్నప్పుడు ఇంటి నిండా జనంతో ఇల్లు ఇరుకై బాధపడుతున్నా, నేను ఢిల్లీ నుంచి వచ్చి హొటల్లో దిగితే కోప్పడేది. దుబారా ఖర్చు చేస్తున్నావనేది. ఇప్పుడు తాను ఒంటరిగా ఉంది కదా. ఇన్నాళ్ళ తరవాత వచ్చాను. అయినా, తన దగ్గర ఉండమనడం లేదు. ఈమధ్య రెండు నెలలపాటు డబ్బు పంపించలేదని కోపం వచ్చిందేమో" అనుకున్నాడు.

"ఏమిటో, పనులు పెరిగిపోయి వ్యవధి లేక డబ్బు పంపించలేకపోయానమ్మా? నీకేమైనా ఇబ్బందైందేమో.. కేశవ ఏమన్నా ఇస్తున్నాడా" అన్నాడు ఎంతో ఆదుర్దా పడుతున్నట్లు.

"వాడికీ ఏవో ఇబ్బందులుంటాయిగా" అంది వర్ధనమ్మ ఎంతో మామూలుగా.

"అయ్యో. మరెలా గడుస్తోంది? పోనీ, ఉత్తరమైనా రాయకపోయావా?"

"ఆఁ, నాకొక్కర్తికి ఎంతలో గడుస్తుందిరా! నాకేం పెద్ద అవసరాలున్నాయి? వెనక వాటా అద్దెకిచ్చాంగా, దాంతోనే సరిపోతుంది నాకు. మీరేం ఇబ్బంది పడకండి అనవసరంగా."

అద్దె ఎంత వస్తుంది అని అడగడానికి మొహమాట పడ్డాడు రాఘవ. చాలీచాలని అద్దె గురించి వివరాలు చెప్పలేదు వర్ధనమ్మ.

"సరే, ఏదైనా అవసరం పడితే ఉత్తరం రాయి. లేకపోతే కేశవ చేతనైనా రాయించు. ఇప్పటికైనా మనసు మార్చుకుని కేశవ కుటుంబాన్ని దగ్గర పెట్టుకో. నీకు ఏ ఇబ్బందీ ఉండదు" అంటూ లేచాడు వెళ్ళడానికి.

సమాధానంగా వర్ధనమ్మ ఏమీ మాట్లాడలేదు. కుర్చీ పీట మీంచి లేచింది కొడుకుని సాగనంపడానికి.

వెళ్ళేటప్పుడు రాఘవ జేబులో చెయ్యి పెట్టి పర్సుని తడిమినా, బయటికి తియ్యలేదు. బ్యాంక్ నుంచి కాస్తో కూస్తో వడ్డీ వస్తోంది కదా, దానికి సాయం ఇంటద్దె వస్తోంది. ఇంకా కావాలంటే అడుగుతుందిలే - అనే ఆలోచన మనసులో మెదిలింది. నిశ్చింతగా బయటికి నడిచాడు. కొడుకు సందు మలుపు తిరిగాక, తలుపు తాళం వేసుకొని బయలుదేరింది వర్ధనమ్మ. ఎండ తగ్గుముఖం పట్టింది. వర్ధనమ్మ పక్క వీధిలో రెండో సందులో ఉన్న కంసాలి దుకాణానికి చేరుకుంది దారిలో వీళ్ళనీ వాళ్ళనీ అడిగి తెలుసుకుంటూ.

"రండి మామ్మగారూ, కులాసాయేనాండీ? ఏంవన్నా పనిబడిందాండీ? కబురంపితే మా అబ్బాయినైనా పంపేవోణ్ణి కదండీ" అంటూ సాదరంగా ఆహ్వానించాడు గణపతి -భర్త ఉండగా ఎప్పుడూ ఇటువైపుకి రానిది ఈవిడ ఇలా వచ్చారేమిటి అని ఆశ్చర్యపోతూనే. "కబురు పెట్టడానికి ఎవరున్నారయ్యా - ఈ పూసల పేరు పెరిగిపోయింది. కాస్త అతికి పెడతావని పట్టుకొచ్చాను" అంటూ నడుం దగ్గర దోపుకున్న సంచీలోంచి ముత్యాలూ, పగడాలూ చుట్టిన గొలుసు తీసిచ్చింది గణపతికి. పక్కనున్న ఎత్తుపీట మీద చతికిల బడింది.

భర్త పోయాక మంగళ సూత్రాలు, నల్లపూసల గొలుసూ, ముక్కుపుడకా అన్నీ తీసేసినప్పటి నుంచీ ఈ ముత్యాలూ పగడాలూ చుట్టిన గొలుసే మెళ్ళో వేసుకుంటూ వచ్చింది. రెండు రోజుల క్రితం నిద్రపట్టక పక్క మీద దొర్లుతూంటే చిక్కుపడింది కాబోలు. పొద్దున్న చూసుకుంటే తెగిన గొలుసు కంటబడింది పక్కమీద. మెడ బోసిగా పెట్టుకు తిరగాలంటే ఏమిటోలా అనిపించింది. ఈ రెండు రోజుల నుంచీ మెడ చుట్టూ పయిట కొంగు కప్పుకున్నా మనసులో వెలితి అలాగే ఉంది.

కంసాలికి కబురు పెడదామంటే సమయానికి ఎవరూ కనిపించలేదు. అయినా, పూర్వంలాగ కబురు పెడితే వస్తాడో రాడో - తీరా రాకపోతే తాను వెళ్ళడం ఎలాగూ తప్పదు.

అక్కడికీ పక్కింటి మీనాక్షమ్మగారి కోడల్ని అడిగి చూసింది - తీసికెళ్ళి అతికించి తీసుకొస్తావా అని.

"అయ్యో మామ్మగారూ. ఇవ్వాళే మా పుట్టింటికి వెళుతున్నానండీ. వచ్చే నెల్లోగాని తిరిగి రానండీ" అంది. మీనాక్షమ్మగారిని అడిగి లాభం లేదు. ఆవిడ ఇటువంటి పనులకు ఇల్లు కదిలే బాపతు కాదు. నమ్మకంగా పంపించడానికి ఇంకెవరూ కనిపించలేదు. ఢిల్లీ నుంచి చుట్టపు చూపుగా వచ్చిన కొడుక్కి ఇలాంటి పని ఎలా అప్పగించడం? అయినా, ఎన్నాళ్ళని ప్రతి చిన్న పనికీ ఎవరో ఒకరిపైన ఆధారపడటం? ఎప్పుడూ వెళ్ళని చోట్లకి వెళితే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోనని ఎన్నాళ్ళు గింజుకోవడం? అనుకునే వాళ్ళెవరైనా తన పనులు చేసి పెట్టడానికి ముందుకొస్తున్నారా అని మొండికేసి బయలుదేరింది. ఇదివరకైతే వీధిలోకి వెళ్ళే అవసరం లేకుండా అన్ని వస్తువులూ ఇంట్లో తెచ్చి పడేసేవాడు భర్త. ఇదివరకు పిల్లలు దగ్గరున్నప్పుడుకూడా వాళ్ళ చదువులు పాడవుతాయని వాళ్ళకి ఏ పనులూ చెప్పనిచ్చేవాడు కాదు భర్త. విసుక్కుంటూనో, తిట్టుకుంటూనో తానే తెచ్చిపడేసేవాడు. వాళ్ళకి ఉద్యోగాలొచ్చి పెళ్ళిళ్ళయాక ఇంక ఎవరి తోవ వాళ్ళదే అయింది. కంసాలి గొలుసు అతికించి ఇచ్చాడు. డబ్బుకూడా తీసుకోలేదు. " ఈ మాత్రం దానికి మీ దగ్గర తీసుకోవడం ఏమిటండీ"

అన్నాడు పూర్వపు గౌరవాన్ని చూపిస్తూ. అతని దుకాణం వ్యవహారంలో ఏదో సాయం చేశారన్న విశ్వాసం ఉంది గణపతికి.

మర్నాడు బజారు నుంచి తిరిగి వచ్చేటప్పుడు ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కుని సంచీలో వేసుకొని తిరిగి వస్తూంటే దారిలో కేశవ ఎదురయ్యాడు.

"ఏమిటమ్మా ఇది" అన్నాడు నిర్ఘాంతపోతున్నట్లూ, నిష్ఠురంగానూ.

"ఏమిటిరా" అంది వర్ధనమ్మ అర్థం కానట్లు.

తల్లి చేతిలోంచి సంచీ తీసుకోబోయాడు. చటుక్కున చెయ్యి వెనక్కి లాక్కుంది. "ఫరవాలేదులే. బరువేం లేదు. నువ్వు పద" అంటూ అడుగులు ముందుకు వేసింది.

ఇంట్లోకి వెళ్ళాక బల్ల మీద కూచుని తల్లిని కూడా కూచోమన్నాడు. ఆవిడ తలుపుకి జార్లబడి కుర్చీపీట మీద కూచుంది.

"ఏమిటి నీ ఉద్దేశం" అన్నాడు నిలదీస్తున్నట్లు.

"ఏ విషయంలో?"

"ఇంకా ఏఁవిటి? ఎందుకిలా మమ్మల్ని వీధిలో పెడతావ్?"

"ఇప్పుడు నేనేం చేశానురా - అంత బాధ పడుతున్నావు."

"ఇంకా ఏం చెయ్యాలి? ఈ వయస్సులో నువ్వు మమ్మల్ని అందరినీ దూరంగా ఉంచి, నువ్వెందుకిలా ఒంటరిగా ఉండటం? నలుగురూ మా గురించి నాలుగు రకాలుగా అనుకోవాలనా? నువ్వెళ్ళి సామాన్లు మోసుకురావడం ఏమిటి?"

"మీ నాన్నగారు నాకన్నా పదేళ్ళు పెద్ద. మొన్న మొన్నటి వరకూ ఆయన చేసుకోలేదూ ఈ పనులన్నీ? అప్పుడు అనుకోనివాళ్ళు ఇప్పుడెందుకనుకోవడం? అయినా, అనుకునేవాళ్ళను ఆపగలమా? మీరు దగ్గరున్నా అనుకుంటారు, లేకపోయినా అనుకుంటారు. ఇప్పుడు మాత్రం నేను ఒంటరిగా ఎక్కడున్నాను? ఇంట్లో కాపురం ఉన్న వాళ్ళున్నారు, ఇరుగు పొరుగు వాళ్ళున్నారు. వీధిలో చుట్టూ బోలెడు మంది ఉన్నారు. మీరంతా వస్తూ పోతూనే ఉన్నారు. నేను ఒంటరిగా ఎక్కడున్నాను" అంటూ, 'ఆ మాటకొస్తే నేను జీవితంలో ఒంటరిగా లేనిదెప్పుడు' అనుకుంది మనసులో.

"నీ కోసం చీటికీ మాటికీ అంత దూరం నుంచి రావాలంటే ఎంత కష్టం?"

"రావడమెందుకు? అవసరమైతే ఓ కార్డు ముక్క రాస్తే సరిపోతుందిగా?"

"మేము ఇక్కడికొచ్చి ఉంటే ఆ బాధా ఉండదుగా. నీకు ఇబ్బంది ఉండదు."

"నా కిప్పుడు ఇబ్బందేం లేదు" అంది వర్ధనమ్మ ముక్తసరిగా, ఇంక వాదన అనవసరం అన్నట్లుగా.

కేశవ మొహం ముడుచుకున్నాడు.

వర్ధనమ్మ లోపలికి వెళ్ళి నాలుగు బిస్కట్లు ప్లేటులో తెచ్చి చేతికిస్తూ, "కాఫీ కలపనా" అంది.

"అక్కర్లేదు, తాగే వచ్చాను" అన్నాడు కటువుగా. అక్కడ తానున్న అద్దె ఇల్లు ఇరుకుగా ఉంది. రెండు గదుల్లో ఎదిగిన ఇద్దరు పిల్లలతో ఉండాలంటే కష్టంగా ఉంది. ఇక్కడ నిక్షేపం లాంటి నాలుగు గదుల ఇల్లు, చుట్టూ స్థలం ఉంది. పరాయివాళ్ళకి అద్దెకివ్వడం దేనికి?' ముసలితనంలో ఈవిడకి పీనాసితనం ఎక్కువవుతోంది. కన్నకొడుకూ మనవలూ దగ్గరుండాలనైనా లేదు. ఈమెక్కడి తల్లి అనుకున్నాడు' కసిగా.

కేశవ పెళ్ళయిన కొత్తలోనే వేరింటి కాపురం పెట్టాలని కూచుంది మాలతి. అత్తగారి మడీ ఆచారాలతో కళ్ళలో నిప్పులు పోసినట్లు విలవిల్లాడింది. తాను కావాలో, తల్లి కావాలో తేల్చుకోమంది. కేశవ తల్లితండ్రులకు దూరంగా రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. వర్ధనమ్మ గుడ్లనీళ్ళు కుక్కుకోవడం తప్ప పైకి ఏమీ అనలేదు. అన్నా, ఆవిడ మాట ఏం సాగుతుంది? ఇంట్లో పెత్తనం అంతా తండ్రిదే. ఆయన ధాం ధూం అన్నాడు మొదట కేశవ విడిగా ఉంటానంటే. తరవాత ఏమాలోచించుకున్నాడో, "సరే, వెళ్ళండి" అన్నాడు. అంతే, ఇద్దరు కొడుకులు పుట్టి, వాళ్ళ చదువులూ, బాధ్యతలూ పెరిగినా, సంపాదన చాలక ఆ రెండు గదుల్లోనే కాలక్షేపం చేస్తున్నారు అప్పటినుంచీ. ఇప్పుడు తెలిసొచ్చింది మాలతికి. మొగుడి వెనకాల పడి పోరుతోంది అత్తగారిని ఒప్పించమని. అత్తగారింట్లో ఉంటే అద్దె కలిసొస్తుంది. పిల్లలకి కాలేజీ దగ్గరవుతుంది. అత్తగారు ఊరికే కూర్చునే రకం కాదు. తనకీ కొంత విశ్రాంతి దొరుకుతుంది అని మాలతి ఆశ.

అన్నీ మనసులో మెదిలాయి కేశవకి. తల్లి మనసు ఇప్పుడు కొరకరాని కొయ్యలా అనిపిస్తోంది. తల్లి ఇచ్చిన బిస్కట్లు ముట్టుకోలేదు. ప్లేటు పక్కన పెట్టేశాడు. 'ఈవిడ బిస్కట్లు కూడా కొనుక్కు తింటోంది కాబోలు' అనుకున్నాడు ఆవిడకేసి ఓరగా చూస్తూ. ఇదివరకు పిల్లలకి పెట్టడమేగాని ఆవిడ తినగా ఎప్పుడూ చూడలేదు. ఆవిడ ఆలోచనల్లో ఆవిడ ఉన్నట్టుంది. పరధ్యానంగా కనిపించింది. 'రాఘవన్నయ్య డబ్బు పంపిస్తున్నాడుగా, ఎలా ఖర్చుపెట్టాలా అని ఆలోచిస్తున్నట్లుంది' అనుకున్నాడు. కేశవకి మరింతగా ఒళ్ళు మండింది.

"ఇక నేవెళతాను" అంటూ విసురుగా లేచాడు.

వర్ధనమ్మ ఉలిక్కిపడి తడబడుతూ లేచి నుంచుని "మంచిది నాయనా, మాలతిని అడిగానని చెప్పు. భాస్కరాన్నీ, బాబిగాణ్ణీ బాగా చదువుకోమని చెప్పు" అంది.

"ఇక్కడుంటే రోజూ నువ్వే చెప్పొచ్చుగా" అన్నాడు మరోసారి ప్రయత్నించి చూద్దాం అన్నట్లు.

"రోజూ చెబితే వింటారా" అంది చిరునవ్వుతో. లోలోపల మండిపడుతూ బయటికి నడిచాడు కేశవ.

'పిల్లలతో, సామానుతో హఠాత్తుగా ఓ రోజున వచ్చి దిగితే ఏం చేస్తుందేమిటి' అనుకున్నాడు బస్సుస్టాపు వైపు నడుస్తూ. కానీ, తండ్రి రాసిన విల్లు గుర్తుకొచ్చి ఆ ఆలోచన అంతలోనే అణగారి పోయింది. ఈ ఇల్లు తన స్వార్జితం అనీ, ఇది తన తరవాత తన భార్యకు చెందుతుందనీ, ఆవిడ తదనంతరం ఎవరికి ఎలా ఇవ్వాలనుకుంటే అలా ఇచ్చుకోవచ్చుననీ రాశాడు విల్లులో. పిల్లల పట్ల తన బాధ్యతలు నిర్వర్తించడం గురించే తప్ప భార్య భవిష్యత్తు గురించి అదివరకు ఎప్పుడూ మాట్లాడలేదాయన. పోయేముందు అటువంటి విల్లు రాశాడని కూడా తెలియదు వర్ధనమ్మకి. బ్యాంకులో ఎంత డబ్బుందో కూడా తెలియదావిడకి. విల్లులో రాసిన విషయం విన్నాక వర్ధనమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈపాటి శ్రద్ధ బతికుండగా తన పట్ల ఒక్కనాడూ చూపించలేదు. చూపిస్తే తన జీవితం మరోరకంగా ఉండేదేమో అనుకుంది. భార్యతో అన్యోన్యంగా ఉండే తన అన్నగారిని అందరూ పెళ్ళాం కొంగుపట్టుకు తిరుగుతాడనీ, భార్యావిధేయుడనీ వేళాకోళం చేసే వారు. నిరంకుశంగానూ, అంటీముట్టనట్టుగానూ ఉంటేనే మొగుడనిపించుకుంటాడు కాబోలు అనుకొనేది వర్ధనమ్మ. భర్త రాసిన విల్లు మాట వినగానే ఒక జీవితకాలం వృథా అయిన భావం కలిగింది వర్ధనమ్మకి. సంతోషంగాని, విచారంగాని వ్యక్తం చెయ్యకుండా నిర్లిప్తంగా ఉండిపోయింది.

పరామర్శకొచ్చిన బంధువులంతా వెళ్ళిపోయాక, తల్లి ఎలాగూ తనని వచ్చి ఇక్కడే ఉండమంటుందని ఎదురు చూశాడు కేశవ. పదమూడు కాదు, ముప్ఫయ్ మూడు రోజులయినా ఆవిడ ఆ ప్రసక్తి తీసుకురాలేదు - ఎన్నిసార్లు కేశవ ఆవిణ్ణి చూడడానికి వెళ్ళినా

అక్కడికీ మాలతి ఓసారి కదిపి చూసింది - "మీరిక్కడ ఒక్కరూ ఏం ఉంటారు? మా దగ్గరకి వచ్చెయ్యండి" అని

"ఎందుకమ్మా అక్కడ మీకే చాలీచాలనట్లుంటే" అంది వర్ధనమ్మ.

"పోనీ, ఇక్కడైనాసరే. అందరం కలిసి ఉంటే సరిపోతుందికదా" అని నసిగింది.

"ఎందుకొచ్చిన అవస్థ! ఎక్కడి వాళ్ళక్కడుంటే చాలు".

అంత ముక్తసరిగా, కచ్చితంగా తీర్పు చెప్పినట్లు అత్తగారు మాట్లాడేసరికి ఇంక లాభం లేదని ఊరుకుంది మాలతి అప్పటిమటుకు. కానీ, అంతటితో వదిలెయ్యలేదు. భర్త చెవిలో పోరు పెడుతూనే ఉంది. కేశవ ప్రతివారం ఏదో ఒక పూట వచ్చి చూసిపోతూనే ఉన్నాడు. తల్లిని చూడటానికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక రకంగా సూచన చేస్తూనే ఉన్నాడు - తాను కుటుంబంతో సహా ఇక్కడకి వచ్చి ఉంటే తల్లికి ఏ ఇబ్బందీ ఉండదని.

వర్ధనమ్మ మాత్రం తనకే ఇబ్బందీ లేదని చెప్తూ వచ్చింది. వచ్చేటప్పుడు అతనూ వట్టి చేతుల్తో వస్తాడు. ఈవిడా అలాగే పంపిస్తుంది కొడుకుని. అలవాటుగా ఏదైనా ఫలహారం చేసి మనవలకు పంపించాలని మనసు పీకేది. కానీ, ఏం చెయ్యాలన్నా చేతిలో డబ్బు, ఇంట్లోకి కావలసిన సరకులూ లేకపోవడం మాట అటుంచి, ఏం చెయ్యాలన్నా మనసొప్పేది కాదు. ఎవరో ఏదో అనుకుంటారని కాదు, ఎందుకో ఆవిడకి ఏదో విరక్తి అది కూడా కాదు - ఏదో చిరాకు.

తల్లి వ్యవహారం చూస్తున్నకొద్దీ కేశవకి చిర్రెత్తు కొస్తోంది. 'టికెట్' అని రెండుసార్లు బస్సు కండక్టర్ అరిచే వరకూ కేశవ ఆలోచనలు తల్లి చుట్టూ పరిభ్రమిస్తూ రొద చేస్తూనే ఉన్నాయి.

★ ★ ★

కరెంటు పోయింది. ఇల్లంతా చీకటిగా ఉంది పట్టపగలే. అలాగే కూచుని ఇక విసుగెత్తి వీధి తలుపు తెరిచి వర్ధనమ్మ గుమ్మంలో నుంచుంది వీధిలో వచ్చేపోయేవాళ్ళని చూస్తూ. కాస్సేపటికి కాళ్ళు పీకి పక్కనే ఉన్న అరుగు మీద చతికిలబడింది. ఊరకే కూచుంటే సమయం వృథా చేస్తున్నట్లనిపించింది. రకరకాల ఆలోచనలు చుట్టుముట్టాయి. ఇదివరకైతే తీరిక అనేది లేకుండా చేతినిండా పని ఉండేది. పదహారో ఏట కాపురానికి వచ్చినప్పటి నుంచీ అదే వరస. పొద్దు పొడవక ముందే లేచి పెరట్లో పాచిపనులు చేయడంతో మొదలు పెట్టి రాత్రి పొద్దు పోయాక పాలు తోడుపెట్టి వంటింటి తలుపు మూసే వరకూ ఇంటి పనులూ, అవికాక పతి సేవ, లేకపోతే పిల్లల సేవ, లేకపోతే రోగిష్టి వాళ్ళయిన అత్తమామల సేవ, ఆ తరవాత మనవలకు సేవ - ఈ వరసన సాగింది సంసార జీవితం ఇంతదాక.

ఇప్పుడూ సాగుతుంది. సాగనిస్తే - కొడుకుల సంసారాల్లోనూ, కూతురి సంసారంలోనూ ప్రవేశిస్తే. కానీ, భర్త మరణం వర్ధనమ్మ జీవితంలో ఒక పెద్ద మలుపు దగ్గరికి తీసుకొచ్చింది. పుట్టాక మొదటి మలుపు పెళ్ళితో వచ్చింది. అప్పుడు తన ప్రమేయం లేదు. పెళ్ళి చేసి,ఈ మార్గాన వెళ్ళు అని అప్పగింతలు పెట్టారు తలిదండ్రులు. భర్త ఆ దారిన నడిపించాడు. తలొంచుకుని సూటిగా నడవడం తప్ప మరో తలపు రాలేదు.

ఇప్పుడలా కాదు. నాలుగు రకాల తోవలు కనిపిస్తున్నాయి. రెండు కొడుకులవీ, ఒకటి కూతురిదీ. నాలుగోది ఒంటరి మార్గం. 'నువ్వొక్కర్తివీ వెళ్ళలేవు' అంటున్నారు పిల్లలు. పిల్లలే కాదు, తెలిసిన వాళ్ళంతా అదే అంటున్నారు. వర్ధనమ్మకి మాత్రం ఎందుకో అలా అనిపించడం లేదు. అది ఒక విధంగా తెలిసిన మార్గమే. ఇన్నాళ్ళూ భర్త ముందున్నాడు, తాను వెనుక నడిచింది. ఇప్పుడు భర్త అదృశ్యమయ్యాడు - తాను ప్రయాణం కొనసాగించాలి. ఇన్నాళ్ళూ భర్త ఉన్నా ముందున్నాడు గాని పక్కన లేడు. వెనుక ఒంటరిగా నడిచినట్లే అనిపించింది. ఆస్పత్రికైనా, మరెక్కడికైనా వెడుతుంటే రోడ్డుమీద నీళ్లగుంట కనిపించినా, పక్కన ముళ్ళ చెట్లున్నా జాగ్రత్త సుమా అని హెచ్చరించేవాడు. పెళ్ళితంతులో చిటికెన వేలు పట్టుకోవడం తరవాత వైవాహిక జీవితంలో పక్కపక్కన నడిచిన గుర్తు లేదు. ఎప్పుడూ వెనకాలే -నీడలా.

చిన్నప్పుడు చెట్లెక్కేది జామకాయల కోసమూ, మామిడికాయల కోసమూ. పన్నెండేళ్ళొచ్చినా చెట్లెక్కుతోందని తల్లి చివాట్లేసేది. తండ్రి చేత కూడా చివాట్లేయించింది - "ఇలా చేసి ఏ కాలో విరక్కొట్టుకుంటే నిన్నెవడు పెళ్ళి చేసుకుంటాడేం?" అని. తరవాత ఒక రావిచెట్టు లాంటి వాడికిచ్చి పెళ్ళి చేశారు ఆ చెట్టు నీడని బతకమని. ఇప్పుడా చెట్టు లేదు. దాని తాలూకు మొక్కలు అక్కడా ఇక్కడా మొలిచి పెద్దవయ్యాయి. మళ్ళీ వాటి నీడన జీవితం కొనసాగించమంటున్నారు.

భవిష్యత్తుని చూపించి భయపెడుతున్నారు. నెలనెలా డబ్బు పంపించకపోతే ఏం చేస్తుంది అని పరోక్షంగా బెదిరిస్తున్నారు. ఆడదానికి తనదంటూ కొంత ఆస్తి - ముఖ్యంగా ఒక నిలువ నీడ ఉండటం ఎంత అవసరమో భర్త రాసిన విల్లు గురించి విన్నాక గాని తెలిసిరాలేదు. పెద్దగా చదువూ సంధ్యా, సంపాదనా లేని తనలాంటి దానికి ఏ ఆస్తీ లేకపోతే పరాధీనపు బతుకే కదా. పిల్లలున్నారు. అయితేనేం - అడ్డాలలో బిడ్డలుగాని గడ్డాలొచ్చాక బిడ్డలా అన్నట్లు - ఏదో వాళ్ళవసరానికి కాకపోతే, అమ్మ ఎందుకు వాళ్ళకి? ఇన్నాళ్ళుగా భర్త, పిల్లలూ, మనవలూ అందరూ తన వాళ్ళే - కానీ, తనదంటూ ఏమీ లేదని ఇప్పుడు గాని తెలిసి రాలేదు. ఇప్పుడీ ఇల్లు తనది అనుకోగానే కొండంత బలం వచ్చినట్లుగా ఉంది వర్ధనమ్మకి.

ఆమధ్య బజారుకెళ్ళినప్పుడు దారిలో గోడల మీద అంటించిన పెద్ద పెద్ద బొమ్మల కాగితాలు చూసింది. సరికొత్త సినిమా - స్త్రీలకు ప్రత్యేక ఆహ్వానం - "అడదంటే అలుసా?" అని ఉందా కాగితాల్లో. ఒక నడివయసు స్త్రీ చెయ్యి పైకెత్తి మంగళసూత్రాల తాడు పట్టుకుని ఏదో అరుస్తున్నట్లుగా ఉంది బొమ్మ. ఏమిటో అర్థం కాలేదు వర్ధనమ్మకి. ఆ సినిమా చూస్తే బాగుండుననిపించింది. ఎప్పుడో చాలాకాలం క్రితం సుమంగళి,

బాలనాగమ్మ, చక్రధారి లాంటి సినిమాలు నాలుగైదు చూసింది బంధువులతో కలిసి. సంసార జంజాటంలో పడ్డాక సినిమాలకి వెళ్ళడం కుదరలేదు. ఇంటి పనులతో, పూజా పునస్కారాలతో తీరిక లేకపోవడంతో పాటు ఆసక్తి కూడా చచ్చిపోయింది. మళ్ళీ ఇన్నాళ్ళకి కుతూహలం కలిగింది. పక్కింటి మీనాక్షమ్మ ఇల్లు వదలదు. కోడలు మంచిదేగాని, సినిమాలకీ వాటికీ భర్తతోనే వెళ్ళడానికి ఇష్టపడుతుంది. ఇరుగు పొరుగులో అంతకన్న అడగతగ్గ వాళ్ళెవరూ కనిపించలేదు. అయినా, ముసలి తోడు ఎవరికి కావాలి? తన కొడుకుతోనూ, కోడలితోనూ సినిమా ప్రసక్తి తీసుకురా బుద్ధి కాలేదు. "ఈ వయసులో కృష్ణారామా అనుకుంటూ ఓ మూల కూర్చోక తగుదునమ్మా అని సినిమాకి బయలుదేరతానంటోంది" అంటారని అనుమానం వేసింది. అయితే, వర్ధనమ్మ కుతూహలం కోరికగా మారి, ఎలా అయినా ఆ సినిమా చూడాలన్న పట్టుదల పెరిగింది.

మర్నాడు మధ్యాహ్నం ధైర్యం చేసి బయలుదేరింది. ఆ సినిమా హాలు ఎక్కడుందో తెలియదు. రిక్షా అతన్ని పిలిచి, ఆ సినిమా పేరుచెప్పి అది ఆడుతున్న హాలుకి తీసుకెళ్ళమంది. అదృష్టవశాత్తూ ఆ హాలు దగ్గరలోనే ఉంది. అక్కడున్నవాళ్ళని చూసి తానూ టికెట్టు తీసుకొంది. ఆ సినిమా చూస్తున్నంతసేపూ ఆ సినిమాలోని నాయికని తనతో పోల్చుకుంటూనే ఉంది. తన అనుభవాలు గుర్తుకొచ్చాయి. ఒకసారి వర్ధనమ్మ చచ్చిపోయిన అత్తగారిని విమర్శించిందని భర్త చెంప ఛెళ్ళుమనిపించాడు. అనుకోని ఆ విఘాతానికి వర్ధనమ్మ తలతిరిగి పడిపోయింది. దాంతో ఆయన గాబరా పడిపోయాడు. ముందు పక్కింటి వాళ్ళనీ, తరవాత డాక్టర్నీ పిలుచుకొచ్చాడు. ఆవిడ చాలా బలహీనంగా ఉందనీ, బి. పి. పెరిగిందనీ, మానసికంగా ప్రశాంతంగా ఉండటం అవసరం అనీ చెప్పాడు డాక్టర్. అప్పటి నుంచీ ముభావంగా ఉండటం అలవరచుకుంది వర్ధనమ్మ. అంతకుముందు రాత్రిళ్ళు ఉండే చనువు కూడా తగ్గింది వయసు పెరగడంతోపాటు. సినిమాలో నాయికని చూసి ప్రశంసించకుండా ఉండలేకపోయింది. ఆమె సంప్రదాయ విరుద్ధంగా ప్రవర్తించినా, ఆమె గురించి నిరసనగా ఆలోచించలేకపోయింది. పైగా, ' మా బాగా చేసింది' అని కూడా అనుకుంది. ఆ సినిమా చూసి వచ్చాక ఏదో ఘనకార్యాన్ని సాధించినంత తృప్తి కలిగింది. మర్నాడు ఏదో మాటల సందర్భంగా మీనాక్షమ్మ కోడలితో తాను చూసొచ్చిన సినిమా గురించి మాట్లాడింది . ఆ అమ్మాయి నిర్ఘాంతపోయింది.

కూతురి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది వర్ధనమ్మకి. దీపావళి పండక్కి రమ్మని రాసింది. వర్ధనమ్మకి వెళ్ళాలనిపించలేదు. 'అక్కడికి వెడితేనే పండగా' అనుకుంది. మమకారాల్ని వదిలించుకోవాలనీ, గతాన్ని మరచిపోవాలనీ, భవిష్యత్తు గురించి భయపడొద్దనీ చెబుతారు. మళ్ళీ ఈ బంధాలు విడిపించుకోలేకుండా చేస్తారు అనుకుంది.

మనసుని మళ్ళించుకోవడానికి వీధి తలుపులు మూసి తాళం వేసి బయలుదేరింది. ఎక్కడికి వెళ్ళాలో ఆలోచించుకోకుండా. నాలుగడుగులు వేశాక భర్త అలవాటు గుర్తుకొచ్చింది. రోజూ ఆ సమయానికి పార్కుకి వెళ్ళేవాడాయన. గుడికి వెళ్ళే దారిలోనే పార్కుంది. దాన్నిండా బోలెడు పూలమొక్కలూ, మైదానం, రకరకాల చెట్లూ - పిల్లలు ఆడుకుంటూ, పెద్దలు కొందరు కూర్చుని ముచ్చట్లాడుకుంటూ, కొందరు ఇటూ అటూ పచార్లు చేస్తూ కనిపిస్తారు. వర్ధనమ్మ లోపలికి వెళ్ళి ఎప్పుడూ చూడలేదు. ఆ పార్కుకి బయలుదేరింది.

పార్కులో మొక్కలన్నిటినీ చూస్తూ తిరుగుతూంటే అక్కడున్న వాళ్ళందరూ తన వైపే చూస్తున్నట్లనిపించి కుంచించుకుపోయింది మొదట. అంతలోనే ధైర్యం తెచ్చుకుని తానే అందరినీ పరిశీలనగా చూస్తూ, గేటు దగ్గరలోనే ఉన్న మెట్టతామర మొక్కల పక్కన పచ్చగడ్డి మీద కూచుంది. దగ్గర్లో పిల్లలు బంతిని తంతూ ఆడుకుంటున్నారు. పసివాళ్ళని కూచోబెట్టుకుని ఆడిస్తున్నారు కొందరు దంపతులు. కొందరు కుక్కపిల్లల్తో వచ్చి అటూ ఇటూ తిరుగుతున్నారు.

గేటుకి అవతల బటానీలవాళ్ళూ, ఐస్‌క్రీముల వాళ్ళూ, బెలూన్లవాళ్ళూ ఇంకా ఎందరో అమ్మకాలు సాగిస్తున్నారు. లోపలికి వచ్చేముందర కొందరూ, లోపల కాసేపు గడిపాక బయటకు వెళ్ళి కొందరూ ఏదో ఒకటి కొనుక్కు తెచ్చుకుంటున్నారు. వర్ధనమ్మకి 'పిడత కింద పప్పు' చూడగానే నోరూరింది. - పిల్లల చేతుల్లో చూడగానే. తన చిన్నతనం గుర్తుకొచ్చింది. చుట్టూ చూసింది. ఎవరి గొడవలో వాళ్ళు ఉన్నారు. కాస్సేపు మడీ, ఆచారం మాట మరచిపోయింది వర్ధనమ్మ. లేచి వెళ్ళి "ఎంతకిస్తావు అబ్బాయ్" అని అడిగింది. "రూపాయిన్నర" అన్నాడు. తెల్లబోయింది. తాను కొనుక్కున్న రోజుల్లో ఓ కానీ! తీరా అడిగాక కొనకపోతే బావుండదని ఒక పొట్లం కట్టి ఇమ్మంది. నడుం దగ్గర దోపుకున్న బట్టసంచీ లోంచి ఒక రూపాయి, అర్ధరూపాయి బిళ్ళలు తీసిచ్చింది. వాడిచ్చిన పొట్లం విప్పి చూస్తే గుప్పెడు అటుకులు కూడా లేవు. కలికాలం, ధరలు మండిపోతున్నాయి. మరీ ఇంత అన్యాయమా అనుకుంది. కొంచెం బాధనిపించింది కక్కుర్తి పడ్డందుకు.

ఇంతకు ముందు కూచున్న చోటుకొచ్చి కూచుంది. కొద్దిగా తీసుకొని నోట్లో వేసుకోబోతుంటే మనవలు గుర్తుకొచ్చారు. అటూ ఇటూ చూసింది. ఏడెనిమిదేళ్ళ ముష్టి కుర్రాడొకడు ఆశగా తన వైపే చూస్తున్నాడు. వాణ్ణి దగ్గరికి పిలిచి కాసిని వాడి దోసిట్లో పోసింది. వాడు సంబరంగా చూశాడు. మిగిలిన కాస్తా నోట్లో వేసుకుంది. నోరు చుర్రుమన్నా రుచిగానే ఉంది. ఆ అనుభవం మరింత రుచిగా ఉందనిపించింది. మనసు అరవై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి గాలిపటంలా ఆకాశంలోకెగిరి గెంతులేసింది.

**ఇండియా టు డే, నవంబర్ 21-5 డిసెంబర్ '96**